www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 11 అక్టోబర్ 2025

5

చిత్తూరు



నేడు జిల్లాకు రాష్ట్ర హోంమంత్రి

దేవళం పేటలో బహిరంగ సభ

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎంపీ ప్రసాదరావు



ప్రజాశక్తి- వెదురు కుప్పం: వెదురు కుప్పం మండలం దేవళంపేటలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన నేపథ్యంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత 11వ తేదీ శనివారం గంగాధర నెల్లూరులో పర్యటించనున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం సాయంత్రం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు దేవళంపేటకు చేరుకుని, కూటమి నాయకులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవళంపేటలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీ వారికి దిశ నిర్దేశం చేశారు. చిత్తూరు పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు లోకనాధరెడ్డి, యాదవ సాధికార జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, పెనుమూరు మండలం మండలాధ్యక్షులు రుద్రయ్య నాయుడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తలారి రెడ్డెప్ప, మాజీ జిల్లా పార్టీ కార్యదర్శి మోహన్ మురళీ ఉన్నారు.

నీవా నది ముప్పు తప్పేదెలా..?

- భయం గుప్పెట్లో పరిసర ప్రాంత ప్రజలు
- గురువారం రాత్రి వర్షానికి పొంగిన నది
- మునిగిన నగరంలోని పలు కాలనీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు నగర పరిధిలో ఆరు కిలోమీటర్ల మేర ప్రవహించే నీవానది గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పొంగింది. దీంతో నీవానది పరిసర ప్రాంతాల్లోని కైలాసపురం, వీరభద్ర కాలనీ, తేనబండ, రిక్షా కాలనీలోని పేదల ఆవాసాల్లోకి వర్షపు నీరు చేరడంతో ఈ ప్రాంతాలు నీటమునిగి పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద నీటితో నీవానదిలో నీటి ప్రవాహం భారీగా పెరిగింది. ఈ నది పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు, ఆటో, రిక్షా కార్మికులతో పాటు నగరంలో చిన్నచితక పనులు చేసుకొనే వారితో పాటు చిరువ్యాపారస్తులు 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. 2021లో భారీ వర్షాలతో నీవానది నీటి మట్టం పెరిగి దాదాపు 80 ఇళ్లు నీట మునిగాయి, వరద దాటికి ఇళ్లలోని వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. 15 రోజుల పాటు నీవానది పరసర ప్రాంతాల ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన షెల్టర్లలో ఉండాల్సి వచ్చింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మరోమారు అదే పరిస్థితి ఏర్పడితే ఏమిటి పరిస్థితి అంటూ ప్రజలు భయం గుప్పెట్లో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. ప్రస్తుతం వీరభద్ర కాలనీ, దోభీ కాలనీలోని కొన్ని ఇళ్లు వర్షపునీటిలో మునిగిపోయాయి దీనికి తోడు భారీ వర్ష సూచనలు కలవరపెడుతున్నాయి. గురువారం ఒక్క రాత్రి వర్షానికే నీవానది నీటిమట్టం పెరగడం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు అంటున్నారు. శుక్రవారం ఉదయం నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు. ఆవాసాల్లో నీరు చేరి ఇబ్బందులు పడుతున్న వారికి చిత్తూరు ఎంఎల్ఎ గురజాల జగన్మోహన్ వారి జీజేఎం ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అల్పాహారం అందించారు.



వర్షపునీటిలో మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న నగర కమిషనర్

కాంక్రీట్ వాల్ నిర్మాణమే ప్రత్యామ్నాయం..

ఎన్నికల సందర్భంగా నాటి టిడిపి, అభ్యర్థి నేటి ఎంఎల్ఎ నీవానది పరివాహక ప్రాంత ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూసి కాంక్రీట్‌వాల్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని ఆగస్ట్‌లోనూ చర్చించి ఆరు కిలోమీటర్ల పొడవు నీవానదికి ఇరువారం నుండి కట్టమంచి వరకు కాంక్రీట్‌వాల్ నిర్మాణానికి ఆమోదం పొందారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు కాంక్రీట్‌వాల్ నిర్మాణం కోసం అయ్యే ఖర్చుల వివరాలను అంచనావేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. నిధుల మంజూరు కోసం దాదాపు ఒక్కటిన్నర ఏడాదిగా వేచి చూస్తున్నారు. ప్రభుత్వం త్వరగా నిధులు మంజూరు చేసి నీవానది పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వరద ముప్పుకు గురికాకుండా చూడాలని నగరపరిపాలన ప్రాంతాలైన కైలాసపురం, దోభీకాలని, రిక్షా కాలనీ, తేనబండ వాసులు కోరుతున్నారు. నీవానది ప్రవాహం పెరిగితే తేనబండ వాసులు చిత్తూరు రావడం ఇబ్బందిగా మారుతోంది. ముస్లిం మైనార్టీలు పేదలు నివాసం ఉండే దర్గామిట్ట, తేనబండ హరిజనవాడ వాసులు చిత్తూరు నగరానికి సంతపేట మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రావాలన్నా కష్టమే. కాంక్రీట్‌వాల్ నిర్మాణం, తేనబండ, దర్గామిట్ట ప్రాంతాల్లో నీవానదిపై బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. అధిక వర్షాల సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు పరుగులు పెడుతున్నారే తప్ప తరువాత పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు.

నదిలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

మైసూరు సిటీ శ్రీరంపుర ప్రాంతానికి చెందిన శరత్ రాజ్ (49) అనే వ్యక్తి పెయింటింగ్ పనుల నిమిత్తం చిత్తూరు నగరానికి వచ్చాడు. ఈ నెల 9వ తేదీ చెన్నై-బెంగుళూరు హైవేలోని కియా షోరూం వెనక భాగంలో ఉన్న నీవా నది సమీపంలో టాయిలెట్ కోసం వెళ్లి పొరపాటున నదిలో పడిపోయాడు. శుక్రవారం అటుగా వెళ్లిన ఓ వ్యక్తి అతనిని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చిత్తూరు 2 టౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్య పోలీసు సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని శరత్ రాజ్ కాపాడి, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. 2టౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్యని, సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.



నదిలో పడిపోయిన వ్యక్తిని కాపాడి తీసుకొస్తున్న పోలీసులు



తేనబండ మార్గాన్ని మూసేస్తున్న పోలీసులు

వానకు ఐదు ఇళ్లు నేలమట్టం

బైరెడ్డిపల్లి: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఐదు ఎస్సీ కుటుంబాలకు ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఈ ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం తహసీల్దార్ ప్రసన్నకుమార్ నాగిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకుని పడిపోయిన ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి త్వరలోనే పక్కా ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వీఆర్ఓ, ద్వారా ఆధార్ కార్డులు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించాలన్నిదిగా తెలిపారు.




ఇళ్లలోకి వర్షపు నీరు

బంగారుపాళ్యం: మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో ఇంటివారు రాత్రి మొత్తం వర్షపు నీటిలో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షపు నీటిలో ఇంటిలోని వస్తువులు, నిత్యావసరాలు పూర్తి తడిచి పనికిరాకుండాపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం సిబ్బంది కాలువలు మరమ్మతులు చేయకపోవడం వల్ల వర్షపు నీరు వెళ్లే మార్గం లేక ఇళ్లలోకి వచ్చాయని వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని కాలువలను మరమ్మతు చేయించాలని కోరారు.



అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నవంబర్ నెలలోపు పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖలో పలు అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ లోపు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాలనీలలో తాగునీటి సమస్య రాకుండా యుద్ధ ప్రాతిపదిన నాణ్యమైన పనులు చేపట్టాలని, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు, జడ్పీ నిధుల నుండి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. విజయపురం మండలంలోని సిరిపురం ఎస్టి కాలనీ నందు సుమారు 1.20 లక్షల రూపాయల 15వ ఫైనాన్స్ నిధులతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నింద్ర మండలం, అత్తూరు గ్రామానికి తాగునీటి పైప్లైన్లు పనులు నాణ్యమైన పనులు చేపట్టాలన్నారు. విజయపురం మండలం ఇల్లత్తూర్, కోసల నగరం, జంబాడ మొదలైన గ్రామాలకు తాగునీటి పైపులు త్వరితగతిన పూర్తి చేయాలని, పనులకు సంబంధించిన బిల్లులు ఇచ్చేటప్పుడు సంబంధిత డీఈ చెక్ లిస్ట్‌తో కూడిన బిల్లులతో జడ్పీ సీఈఓకి బిల్లులు అందజేయాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం, జడ్పీ నిధుల నుంచి బిల్లులకు సంబంధించిన అంశాలపై నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. జడ్పీ సీఈవో రవికుమార్, ఎస్సీ ఆర్డబ్ల్యూఎస్ విజయ్ కుమార్, ఎస్సీ పిఆర్ చంద్రశేఖర్, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

క్రమశిక్షణతో ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మెగా డీఎస్సీ 2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొని సూచనలు సలహాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగం పొందడానికి ఎంత కృషి చేసారో అదే తీవ్రతను పాఠశాలల్లో భావిభారత పౌరులను తయారు చేయడంలో కూడా చూపించాలని, ఎక్కడ అవినీతికి తావు లేకుండా కొనసాగాలని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీ పైన ఉందని తెలిపారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటరమణ, వెన్యూ ఇంచార్జ్ ఇందిరా, కోర్స్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఏఈడీ సుకుమార్, ఓవరాల్ ఇంచార్జి సుభాషిణి, ఏఎస్ఓ చాన్‌బాషా, కోర్స్ కో ఆర్డినేటర్ బాలచైతన్య పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

అందరికీ అందుబాటులో కార్పొరేట్ వైద్యసేవలు: ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్రామీణ ప్రాంతాలకు సైతం కార్పొరేట్ వైద్యసేవలను అందించి, ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి చేయూతనివ్వాలని, అందరికీ అందుబాటులో వైద్యసేవలు అనే నినాదంతో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆధ్వర్యంలో చిత్తూరు వేదికగా స్థానిక పివికేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని 11వ తేదీ శనివారం నిర్వహించనున్నారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించే నైపుణ్యం ఉన్న వైద్యులు పాల్గొంటారు. రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, ఈసీజీ, యు.ఎస్.జి. పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. అలాగే ఎముకలు, మోకాలు, గుండె, నరాలు, చెవి, ముక్కు, గొంతు, గర్భవతులు (ప్రసూతి), చిన్నపిల్లలు, కంటికి సంబంధించి సుమారు 37 వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వైద్యసేవలను అందించడంతోపాటు, ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నారు. 45 సంవత్సరాలు పైబడిన వారికి రీడింగ్ గ్లాసులను, వయోవృద్ధులకు వైద్యులు సూచించిన మేరకు కంటి అద్దాలను ఉచితంగా అందివ్వనున్నారు. శుక్రవారం ఎంపి చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా ఉచిత వైద్యశిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వైద్యశిబిరం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కడా పీడీ

ప్రజాశక్తి- కుప్పం

కుప్పంలో రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్సీ శ్రీకాంత్, కడ పీడీ వికాస్ మర్మత్ శుక్రవారం పరిశీలించారు. బైపాస్ రోడ్డులోని క్రిష్ణగిరి సర్కిల్ వద్ద నుండి టిడిపి కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ, సర్వీస్ రోడ్, ఫుడ్ స్ట్రీట్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో తరచూ యాక్సిడెంట్ జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు డివైడర్లు ఏర్పాటు అంశంపై చర్చించారు. కడా అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజకుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కె. వెంకటేష్, ఏఎంసి చైర్మన్ మునిరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

అరటిని అడిగే వారు లేరు..

- తోటల్లోనే మాగి, రాలిపోతున్న పండ్లు
- లక్షల పెట్టుబడి నేలపాలు
- పడిపోయిన అరటి ధరలు, నష్టాల్లో రైతులు

ప్రజాశక్తి- వి కోట: అరటి ధరలు భారీగా పడిపోవడంతో అరటి పంట తోటల్లోనే మాగి రాలిపోతున్నాయని దీంతో రైతుల లక్షల పెట్టుబడి నేలపాలు అవుతోంది, పెట్టుబడికి కూడా రాకపోవడంతో వారు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

వి కోట మండల పరిధిలో అరటి సాగు చేసిన రైతుల బాధలను ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోగా గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం పూర్తిగా రైతులను విస్మరించడంతో అరటి రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండల పరిధిలో సుమారు 200 ఎకరాల్లో రైతులు అరటి పంటను సాగు చేశారు. ఈ ప్రాంతానికి అనుకూలమైన జి9 , రోబోస్టో పచ్చి అరటి రకాలు అనువైనవి కావడంతో అధికంగా సాగు చేస్తారు. ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీపై విత్తన మొలకలు కొనుగోలుకు, పంటకు అవసరమైన ఎరువులు, మందులకు సబ్సిడీ అందిస్తుంది. దీనికి తోడు గత సంవత్సరం కేజీ అరటి రూ.15లు వరకు ధర పలకడంతో కూలీలను తగ్గించుకోవడంతోపాటు ఒక్కసారిగా పెద్ద మొత్తంలో డబ్బు వచ్చి తమ అవసరాలు తీరుతాయన్న ఆశతో పెద్దఎత్తున రైతులు అరటి సాగవైపు మొగ్గు చూపారు. దీనితో సుమారు 200 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. ఎకరాకు దుక్కులు దున్నడం, సాంప్రదాయ, రసాయన ఎరువులు, కూలీలు, మొక్కల సస్యరక్షణ తదితరాలకు సుమారు ఎకరాకు ఒక లక్ష రూపాయలు ఖర్చు అవుతోంది.



తోటల్లోనే మాగిపోతున్న అరటి

మార్కెటింగ్ లోపం.. దళారులకు వరం :

ప్రభుత్వపరంగా అరటి కొనుగోలుకు సంబంధించి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పాటు.. రైతులకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. రైతులు మధ్య దళారులు, స్థానిక వ్యాపారులపైనే ఆధారపడుతుంటారు. కోల్డ్ స్టోరేజ్జీలు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు నిర్ణయించిన ధరలకే రైతులు తమ పంటలను విక్రయించాల్సి ఉంటుంది. సాధారణంగా ఒక అరటి గెల 40 నుండి 50 కేజీల వరకు బరువు వస్తుంది. ఈ ప్రాంతం నుండి కొనుగోలు చేసిన అరటిని బెంగళూరు, చెన్నై, నెల్లూరు తదితర దూరప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ సంవత్సరం వర్షాలు ఆశాజనకంగా కురవడంతో ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని పులివెందుల, రాజంపేట, కోడూరు తదితర ప్రాంతాల్లో విస్తారంగా అరటి దిగుబడి రావడంతో బయటి ప్రాంతాల వ్యాపారులు అటువైపు వెళ్లారు. వీకోట ప్రాంతంలో నాణ్యతా ప్రమాణాలతో పండిన అరటి గెలలు బరువు అధికం కావడం సీపులు తక్కువ రావడంతో పంటకు డిమాండ్ తగ్గిపోయింది. దీనితో అరటిని కొనుగోలు చేసేవారు, అడిగేవారు లేక కేజీ 2 రూపాయలకు పడిపోయింది. ముఖ్యంగా మండల పరిధిలోని ముమ్మడేర్లపల్లి, ఇటుకరాళ్లపల్లి, జవ్వనపల్లి, ఎర్నపల్లి, గెస్తంపల్లి తదితర ప్రాంతాల్లో పంట విస్తీర్ణం పెరిగి పెట్టుబడులు కూడా రాక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అప్పులే మిగిలాయి..


- సోము, రైతు, ముమ్మడేర్లపల్లి



మంచి ధర వస్తుందని, పెట్టుబడిపోను కొంతైనా లాభం మిగులుందని లక్షలు అప్పులు చేసి అరటి పంటను సాగు చేశాను. వర్షాలు కూడా బాగా కురవడంతో మంచి దిగుబడి వచ్చింది అయితే మార్కెటింగ్, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. ప్రభుత్వమే అరటిని కొనుగోలు చేసి సబ్సిడీలు అందించి రైతులను ఆదుకోవాలి.

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి

- బాబు, రైతు, కల్లుపల్లి



అరటి పంట సాగుకు వికోట అనువైన ప్రాంతం కావడంతో రైతులు ఖర్చుకు వెనకాడకుండా అప్పులు చేసి పంట సాగు చేస్తాము. నాణ్యమైన పంట వచ్చినా ధరలు లేక కొనుగోలుదారులు రాక తోటలోని అరటి మాగిపోతున్నాయి. అరటి పక్వానికి వచ్చిన వెంటనే సరైన సమయానికి మార్కెట్‌కు తరలిస్తే మంచి ధర వస్తుంది. కానీ కొనేవారు లేక అలాగే పొలాల్లోనే పంట ఉండిపోవడంతో అరటి పండ్లు తోటల్లోనే మాగిపోతున్నారు. దీంతో పెట్టుబడి రాకపోగా అప్పులు మాత్రమే మిగుతున్నాయి. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తే రైతులు పంట దిగుబడి ఉన్న పంటను నిల్వ ఉంచుకుని ధర ఉన్నప్పుడు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది.

కాలక్షేపంగా.. సర్వసభ్య సమావేశం

సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా..

ప్రజాశక్తి- పూతలపట్టు: గతంలో మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం అంటే అధికారుల్లో వణుకు పుట్టేది. ప్రజాప్రతినిధులు ఏ సమస్యలపై తమను నిలదీస్తారోనని ముందుగా సన్నద్ధమై సమావేశానికి వచ్చేవారు. ప్రజాప్రతినిధులు సైతం ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి అధికారులను నిలదీసేవారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ నాయకుల మధ్య కూడా అభివృద్ధిపై మాటల యుద్ధం జరిగేది. కానీ నేడు జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశాలు కాలక్షేపానికి సాగినట్టుగా కనిపిస్తున్నాయి. అధికారులు తమ శాఖకు సంబంధించి మాట్లాడాల్సి వచ్చినప్పుడు నేరుగా వచ్చి సమస్యలు ఏవైనా ఉంటే చెప్పాలని ప్రజాప్రతినిధులు అడుగుతున్నారు. వారు నోరు మెదపకపోవడంతో వెళ్లి కూర్చుంటున్నారు. చివరగా మండల స్థాయి ఒకరిద్దరు అధికారులు మామా.. అంటూ రెండు మాటలు మాట్లాడి సమావేశాన్ని ముగించేస్తున్నారు. శుక్రవారం పూతలపట్టు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశం కూడా ఇలానే కనిపించింది. చాలా శాఖల అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టగా వచ్చిన అధికారులు ప్రజాప్రతినిధుల సైతం అటు ఇటు తిరుగుతూ కాలయాపన చేశారు. ఒక సమయంలో వేదికపై ఎంపీడీవో వైస్ ఎంపీపీ మాత్రమే కూర్చొని సమావేశాన్ని జరిపించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈసమావేశానికి వచ్చిన ఎంపీపీ కుమారి, జడ్పిటిసి దేవిక మొదట్లోనే లేచి వెళ్లిపోయారు. తిరిగి సమావేశ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు.

అధికారులు లేని సమావేశం ఎందుకు...

ప్రజాప్రతినిధులు తమ సమస్యలు చెప్పుకోవడానికి కూడా సమావేశంలో అధికారులు లేకపోతే సమావేశాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని పేట సర్పంచ్ రాధాకృష్ణనాయుడు సమావేశంలో గళమెత్తారు. గతంలో ఎన్నడూ ఇంతటి హేయమైన సమావేశాన్ని చూడలేదంటూ ఆయన అధికారులపై మండిపడ్డారు. ఎంపీడీవో సద్దిచెప్పడంతో సమావేశంలో గందరగోళం కాస్త సద్దుమణిగింది.



అధికారులను నిలదీస్తున్న పేట సర్పంచ్

అపోలో యాజమాన్యం సమాధానం చెప్పాలి

విద్యార్థి సంఘాల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో యూనివర్సిటీ విద్యార్థినుల బాత్‌రూమ్‌లో హిడెన్ కెమెరా కనుగొనబడిన హేయమైన ఘటనను ఖండిస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, విద్యాసంఘాల నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని అపోలో యూనివర్సిటీ ప్రధాన ద్వారం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కే.శివారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు మసూద్, సూర్య, అభినేష్, సుభాష్, చిత్తూరు జిల్లా స్టూడెంట్స్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ సద్దాం మాట్లాడుతూ ఈఘటనకు సంబంధించి ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయడాన్ని విద్యార్థి సంఘాలు స్వాగతిస్తున్నాయని తెలియజేశారు. ఈ కీలక అరెస్ట్ జరిగినప్పటికీ, యూనివర్సిటీ అత్యున్నత అధికారులు, వైస్ ఛాన్సలర్ వినోద్ బట్, రిజిస్ట్రార్ పోతరాజు ఇప్పటికీ కనీస బాధ్యతగా పోలీసులకు అధికారిక ఫిర్యాదును దాఖలు చేయడాన్ని నిరాకరిస్తున్నామని మండి పడ్డారు. ఘటన జరిగి నాలుగు రోజులు అవుతున్నా విషయాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న వారి వైఖరి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వీసీ, రిజిస్ట్రార్ వైఖరే నేరస్తులకు పరోక్షంగా అండగా నిలుస్తోందని, వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారిని వెంటనే పదవుల నుండి తొలగించాలని, అరెస్ట్ అయిన నిందితుడికి త్వరితగతిన విచారణ జరిపి, కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



అపోలో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కురపల్లిలో మౌలిక వసతులు కల్పించాలి: సిపిఎం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా కురపల్లి కాలనీలో దెబ్బతిన్న రోడ్లు, వర్షపు నీరు చేరిన ఇళ్లను శుక్రవారం సిపిఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి ఏడు సంవత్సరాలవుతున్నా కనీసం మౌలిక వసతులు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. కాలనీలో రోడ్లు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, దాదాపు 500 కుటుంబాలకు గతంలో ప్రభుత్వాలు కాలనీ ఏర్పాటు చేసినప్పటికీ మురుగునీటి కాలవలు, రోడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల వర్షం పడితే నడవలేని పరిస్థితి ఉందన్నారు. పేదలు నివసిస్తున్న కాలనీపై ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. వీధిలైట్లు కూడా వెలగకుండా రాత్రుల్లో చీకటమయంగా మారడంతో అడవి ప్రాంతంగా మారింది, ఈ కాలనీకి వచ్చే రహదారిలోని మొరం పంచాయతీ వద్ద వంతెన వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉందని వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి కోసం పేదలు బయటి వెళ్ళినప్పుడు దొంగతనాలు జరుగుతున్న పరిస్థితి ఉందని, పట్టపగలే తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారని, సింథటిక్ వాటర్ ట్యాంకులు కూడా దొంగతనానికి పాల్పడుతున్నారని పోలీసులు వీటిపై దృష్టిపెట్టాలనికోరారు. కాలనీల్లో తాగునీటి కూడా ఇబ్బందికరంగా ఉందని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, కాలనీసవాసులు యాషుబ్, బాబు, కళావతి, మహమ్మద్ బాషా, భారతి పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

సంఘమిత్రల పోరాట విజయం

మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దుపై సిఐటియు హర్షం

ప్రజాశక్తి- పలమనేరు: సంఘమిత్రలు రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల ఒకటి నుండి ఆన్లైన్ వర్క్ ఆపేసి పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేయడం అభినందనీయమని ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం సిఐటియు గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు హామీలు నెరవేర్చకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి ఆన్లైన్ వర్క్లు పూర్తిగా బంద్ చేయడం జరిగిందని, దీంతో దిగివచ్చిన ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రమాదకరమైన మూడు సంవత్సరాలు కాలపరిమితి సర్కులర్ రద్దు చేయడం వీవోయలను తొలగించే హక్కు జనరల్ బాడీలో తీర్మానం చేస్తే చేయాలే తప్ప రాజకీయంగా తొలగించబడదని సర్క్యులర్ ఇవ్వడం అభినందనీయమన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన..

ప్రజాశక్తి-కుప్పం: పోస్టు ఆఫీస్ వద్ద పోస్టల్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. పోస్టల్ యూనియన్ నేషనల్ జనరల్ సెక్రటరీ మహదేవయ్యను సర్వీసు నుండి తొలగించడం దారుణమని, ప్రభుత్వం కక్ష గట్టి అతన్ని తొలగించిందని ఆరోపించారు. వెంటనే మహదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పోస్టల్ ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించి కనీస వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహదేవయ్యను విధుల్లోకి తీసుకునేంత వరకు నిరసన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా జరుగుతాయని పోస్టల్ ఉద్యోగులు స్పష్టం చేశారు. యూనియన్ ప్రెసిడెంట్ నరసింహులు, బ్రాంచ్ సెక్రటరీ కార్తీక్, అసిస్టెంట్ సెక్రటరీ కోదండ, వైస్ ప్రెసిడెంట్ శివ సుబ్రహ్మణ్యం, లోకేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

అంగన్వాడీల ద్వారా పోషకాహారం



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం: అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందివ్వడం జరుగుతుందని క్రమం తప్పకుండా వీరికి అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారాన్ని తరపున చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. రాష్ట్రీయ పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుప్పంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మాసం పై అవగాహన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసిందని తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, సిడిఎస్ సిడిపిఓ చంద్రకళ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్కు సత్కారం

ప్రజాశక్తి-కుప్పం: స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు అందుకున్న కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును టిడిపి నేతలు ఘనంగా సత్కరించారు. కుప్పం మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కమిషనర్ శ్రీనివాసరావు ఎంతగానో కృషి చేస్తున్నారని ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం మున్సిపాలిటీని రాష్ట్రస్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు ఇవ్వడం పట్ల కడ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, రెస్కో చైర్మన్ ప్రతాప్, మున్సిపల్ టిడిపి అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వేలు, బిస్తా కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగల్, మహిళ నేతలు పాల్గొన్నారు.

తీపి మొక్కజొన్న సాగుపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): జిల్లాలో సాగుచేస్తున్న తీపి మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశించి నష్టం కలిగించే అవకాశముందని, రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఏరువాక కేంద్రం, ప్రిన్సిపల్ సైంటిస్ట్ (సస్యరక్షణ) అండ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.రామకృష్ణారావు తెలిపారు. కత్తెర పురుగు నివారణకు వంఎటనే సమగ్ర సస్యరక్షణా పద్ధతులు పాటించాలని తెలిపారు. లింగాకర్షక బుట్టలను ఎకరానికి 10 చొప్పున విత్తిన వెంటనే అమర్చాలని, విత్తినప్పటి నుండి 25 రోజుల వరకు 5శాతం వేప గింజల కషాయాన్ని, పురుగు మందులను రైతులు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ సూచనలను జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు తెలియజేయాలని తెలిపారు.

సుప్రీం కోర్టు జడ్జిపై దాడిని ఖండిస్తూ

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - విజయపురం (నగరి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్పై చెప్పుతో దాడికి ప్రయత్నించడం విచారకరమని నగరి జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఇది రాజ్యాంగంపై, న్యాయ వ్యవస్థపై దాడి అని వాపోయారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నగరి బార్ అసోషియేషన్ అధ్యక్షులు వేలాయుధం, కోశాధికారి నాగరాజన్, సెక్రెటరీ జాన్ జోష్, జాయింట్ సెక్రెటరీ తిరుమలై, ట్రెజరర్ అరుణ్, ఈజీ బాబు, శేఖర్, రాము, మదన్, లోకేష్, నరేంద్ర కుమార్, మురళీకృష్ణ, ఎం.బాబు, మోహన్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని వీర్నమల పంచాయతీ కుల్లాగానూరు గ్రామానికి చెందిన వైసిపి వార్డు సభ్యుడు మురళి గుండెపోటుతో మృతిచెందాడు. శుక్రవారం సమాచారం తెలుసుకున్న వైసీపీ నేతలు ఆయన భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీర్నమల, పెద్దతండ, చిక్కుపల్లి తాండ, గుంటూరు తండా, వైసీపీ నేతలు తరపున వారి కుటుంబానికి రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. వైసిపి అధ్యక్షుడు బాబురెడ్డి, సుబ్రహ్మణ్యం, చంద్రారెడ్డి, యశ్వంత్ రెడ్డి, మోహన్ నాయక్, రవి నాయక్, చిన్నరాజు నాయక్ పాల్గొన్నారు.

మునిరెడ్డి మృతికి నివాళి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని జీడి నెల్లూరు పంచాయతీ మోతరంగనపల్లి గ్రామానికి చెందిన దామోదర్ రెడ్డి తండ్రి మునిరెడ్డి (90) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. దామోదర్ రెడ్డి రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్రెడ్డి గన్ మెన్గా విధులు నిర్వహిస్తున్నారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి మునిరెడ్డి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల అధ్యక్షులు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ మార్కెట్కమిటీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, ఢిల్లీ కుమార్, చంద్రగిరి కాలప్ప పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన

ఎగ్జిబిషన్ను ప్రారంభించిన కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జీఎస్టీ 2.0 ద్వారా ధరల తగ్గింపుపై వినియోగదారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చిత్తూరు పట్టణం జ్యోతిరావు పూలే బిసి భవన్లో కమర్షియల్ ట్యాక్స్ ఆధ్వర్యం ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్ ఎగ్జిబిషన్ను కలెక్టర్ సుమిత్ కుమార్, నగర మేయర్ అముద ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య మానవుడికి మేలు కలిగేలా జిఎస్టి 2.0 ద్వారా పన్నువిధానంలో సంచాలనాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్ సందర్భంగా రెండు రోజుల ఎగ్జిబిషన్ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎగ్జిబిషన్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, కిచెన్, మైక్రో ఇరిగేషన్, చేనేత, ఎల్ఐసి వంటి ఇతర అంశాలకు సంబంధించి 44 స్టాల్స్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాణిజ్య పన్నులశాఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసిన రెండురోజుల ప్రదర్శన, విక్రయాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నగర పాలక కమిషనర్ నరసింహ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ఎగ్జిబిషన్లో జిల్లా పండ్ల పరిశ్రమ సమాఖ్య, ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు పళ్ళ రసంలపై అవగాహన కొరకు ఉచితంగా మామిడి పళ్ల రసం పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగినదని పండ్ల పరిశ్రమ సమాఖ్య కార్యదర్శి కట్టమంచి బాబి తెలిపారు.

కుప్పం: కూటమి ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జీఎస్టీ తగ్గింపు మేళా నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు ప్రజలకు ఉపశమనం వ్యాపారానికి ఊపిరి నిస్తోందని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గించడం వల్ల నిరుపేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని జీఎస్టీ తగ్గింపు పై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. కడా పీడీ వికాస్ మర్మత్, టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్, విస్తీర్ణ కమిటీ సభ్యుడు మంజునాథ్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగల్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఎంపీడీవో పురుషోత్తం ఆధ్వర్యంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి సీనియర్ నేత మోహన్ మురళి, సొసైటీ చైర్మన్ సుధాకర్రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి అనిత, ఏపిఎం పరశురాంరెడ్డి పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని మంజునాథ కళ్యాణ మండపంలో కుప్పం నియోజకవర్గంలోని కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫార్మా ట్రేడర్స్, మెడికల్ షాపులు, ఔషధ వ్యాపారులకు జీఎస్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ నార్కోటిక్స్, యాంటీబయాటిక్స్, ఫార్మా వ్యాపారరంగంలో జీఎస్టీ 2.0అమలు, మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్. మునిరత్నం, పిఎంకె ఉడా ఛైర్మన్ సురేష్ బాబు, కడా పీడీ వికాస్ మరమ్మత్ పాల్గొన్నారు.

రామకుప్పం: శుక్రవారం మండల కేంద్రం మైన రామకుప్పంలో జిల్లా జిఎస్టి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్స్, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, టైర్లు, ఎరువులు, పిచికారి మందులు తదితర వస్తువులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కార్వేటినగరం : జిఎస్టిపై కేంద్ర ప్రభుత్వం తగ్గించిన వస్తువులను పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఎగ్జిబిషన్గా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని రాష్ట్రం పొల్యూషన్ డైరెక్టర్ నగలపాటి నాగేశ్వరరాజు, జీఎస్టీ నోడల్ అధికారి సురేష్ అన్నారు. తగ్గిన వస్తువులను సాల్టుగా షాప్ యజమానులు ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులు చెంగల్ రాయల్ యాదవ్, కార్యదర్శి రాజేంద్రరెడ్డి, ఎమ్మెల్యే సోదరులు వి.రాజా, రవి యాదవ్, వాసదేవరెడ్డి, తిరుమలనాథ్ పాల్గొన్నారు.

వి.కోట : వి కోటలోని దుర్గామాత ఆలయ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకంపై అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన డ్రిప్పు పరికరాలు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, ద్విచక్ర వాహనాలు ఉపయోగకరమైన వస్తువుల ప్రదర్శన నిర్వహించారు. నోడల్ అధికారి యుగంధర్ నాయుడు, పిఏసిఎస్ చైర్మన్లు నారాయణస్వామి, హరినాథ్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర, రాంబాబు, విజయ్, జిల్లా జీఎస్టీ సిబ్బంది చరణ్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- కుప్పం

కుప్పం 132 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లో మరమ్మతుల కారణంగా కుప్పం అర్బన్, కుప్పం రూరల్, గుడిపల్లి మండలాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని రెస్కో ఎండి సోమశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు లైన్ క్లియర్ తీసుకుంటున్నందున ఉదయం 7 నుంచి10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పలు మండలాల్లోనూ ..

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో పలు మండలాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జీవన్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు, గంగవరం, వీకోట, బైరెడ్డిపల్లి మండలాల్లో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ సంచుల వినియోగంపై జరిమానా

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లను వాడకూడదు అంటూ మున్సిపల్ అధికారులు పదేపదే హెచ్చరిస్తున్నా దుకాణదారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణదారులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. గడిచిన వారం రోజులుగా మున్సిపాలిటీ పరిధిలో దుకాణాల్లో మున్సిపల్ సిబ్బంది తనిఖీలు చేపడుతున్నారు. శుక్రవారం ప్లాస్టిక్ కవర్లు కలిగిన పలు దుకాణాలకు రూ.1000లు చొప్పున జరిమానా విధించినట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రత్యేక బోధన ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని భవిత కేంద్రంలో అలింకో వారి సహకారంతో సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. గురువారం టిడిపి మండల అధ్యక్షులు వెంకటేశ్వర చౌదరి, గాలి దిలీప్, ఎంఈఓ హేమలత, మోహన్రెడ్డి ఈ కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ భవిత భవన నిర్మాణానికి కావలసిన అన్ని సదుపాయాలను తమ కుటుంబం తరపున అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంఈఓలు హేమలత, మోహన్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, సమగ్రశిక్ష ఏఈ మునిరత్నం, సహిత విద్య ఉపాధ్యాయులు దేవేంద్ర, దిలీప్ పాల్గొన్నారు.

నిరాశ్రయులను ఆదరిద్దాం..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నిరాశ్రయులను ఆదరించి వారికి అండగా ఉండాలని సపోర్టు సంస్థ అధ్యక్షులు వసతి గృహ నిర్వాహకులు పి.జోసెఫ్ రాజు పిలుపునిచ్చారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా మెప్మా చిత్తూరు నగరపాలక సంస్థ సహకారంతో నగరంలోని కైనికట్టు వీధిలో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ఘనంగా ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా జోసెఫ్ రాజు నిరాశ్రయులకు ఐదు రకాల పండ్లు, బ్రెడ్స్ టవల్స్ అందించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఉచిత రక్త పరీక్షలు

ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత రక్త పరీక్షలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామకుప్పం ఎంపీపీ సులోచన గురప్ప శుక్రవారం పేర్కొన్నారు. మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీలో రక్త పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తపరీక్షలు చేసుకొనేవారు ఉదయం పరకడుపున ఏడు నుంచి తొమ్మిది వరకు పరీక్షించుకోవాలన్నారు. శిబిరంలో షుగర్, లివర్ ప్రొఫైల్, కిడ్నీ, కొలెస్ట్రాల్, సిబిసి తదితర వాటిని పరీక్షించి ఫలితాలు ఇవ్వనున్నారు. మాజీ సర్పంచులు రామ్మూర్తి, జయశంకర్, మనేష్, హెల్త్ అసిస్టెంట్ బాలు, పుష్పజ్యోతి, సరస్వతమ్మ పాల్గొన్నారు.

స.హ.చ.పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని వేల్కూర్ గ్రామసచివాలయంలో రైతులకు సమాచార హక్కు చట్టం గురించి రైతులకు రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఏపీసిఎన్ఎఫ్ వాసు మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టం ద్వారా ప్రభుత్వం, ప్రభుత్వం ఆధీనంలోని సంస్థల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చు అని తెలిపారు. ఎన్ఎఫ్ఏడిపిఎం నాంచారమ్మ, డివిజన్ మాస్టర్ ట్రైనర్ రాజా ప్రతాప్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై పునఃవిచారణ

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిష్కరించబడింది తృప్తికరంగా లేని అర్జీలపై మళ్ళీ పునఃవిచారణను శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో నగిరి ఆర్డీవో అనుపమ చేశారు. ఆమె స్వయంగా ఫిర్యాదు పురోగతిపై ఆరా తీశారు. 28 ప్రజాఫిర్యాదు గాను 14 మంది హాజరయ్యారని, హాజరైన వారి సమస్యల ఫిర్యాదులపై విచారణ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

17 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని నల్లరాల్లపల్లి రెవెన్యూలో ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న 17 ఎకరాల ప్రభుత్వ భూమిని తహశీల్దార్ సికె శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఈ భూమిలో మండల సర్వేయర్ గణేష్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో తహశీల్దారు శ్రీనివాసులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. కాగా ఈ భూమి ప్రభుత్వ రికార్డుల ప్రకారం అనాధీనం భూమిగా రికార్డు అయినట్లు తహశీల్దార్ తెలిపారు. సర్వేనెంబర్ 13లోని ఈ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునామని ఈ భూమిలోకి ఎవరు ప్రవేశించకూడదని హెచ్చరించారు. ఈ ప్రభుత్వ భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సూచిక బోర్డు వద్ద తహశీల్దార్, సర్వేయర్

ఎగుమత్యం నది వంతెన పరిశీలన

ప్రజాశక్తి- తవణంపల్లి: వర్షాల కారణంగా వంక నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రవాహానికి మండలంలోని మత్యం పంచాయతీ ఎగుమత్యం దిగుమత్యం మధ్యన ఉన్న నదిలో తాత్కాలికంగా నిర్మించిన వంతెన మరమ్మతులకు గురైంది. విషయం తెలుసుకున్న ట్రైనీ కలెక్టర్ రాజేంద్ర పడేల్, తహశీల్దార్ సుధాకర్, ఆర్ఐ జీవ, వీఆర్వో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి కవిత శుక్రవారం వంతెనను పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా వాహనాల రాకపోకలను నిలిపివేయడంతోపాటు పికిటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ వంతెన మీదుగా కర్ణాటక నుండి జిల్లాలోని కాణిపాకం, తిరుపతికి నిత్యం ప్రయాణికులు, వాహనాలు ప్రయాణిస్తుంటాయని,అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే శాశ్వత పరిష్కరిస్తామని ట్రైనీ కలెక్టర్ తెలిపారు.



వంతెనను, నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ట్రైని కలెక్టర్,

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ఉదాసీన వైఖరి తగదు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ఉదాసీన వైఖరి వహించడం తగదని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డిశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు అనుకూలంగా ప్రకటన వెలబడుతుందని ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూశారని, కానీ మొండి చేయి చూపడం దారుణమన్నారు. ప్రభుత్వంలో ఒక భాగమైన ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను కూటమి ప్రభుత్వం పట్టించకపోవడం అన్యాయం అన్నారు. ఉద్యోగుల ఆవేదన, ఆందోళనలను కూటమి ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వెలుబుచ్చారు. కూటమి ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి తాత్కాలిక భృతి (ఐఆర్) తోబాటు డిఏల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజల వినతులను సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీర్ వెంకట రామరామిరెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వారి కార్యాలయం ప్రజాదర్బార్లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చిత్తూరు అర్బన్, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాలకు సంబంధించిన ప్రజలు కార్యక్రమానికి విచ్చేసి తమ సమస్యల పైన వినతులు సమర్పించారు. హౌసింగ్, రెవెన్యూ, మున్సిపల్ సంబంధిత సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మొత్తం 24 వినతులు అందాయి. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ఇబ్రహీం, డీఈ వెంకట రమణ, హౌసింగ్ డీఈ శ్రీధర్, టిడిపి నగర అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ ఈ ఈ వెంకటరామిరెడ్డి

కోటి సంతకాల సేకరణ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి- కుప్పం: ఏపీలో వైసీపీ హయాంలో ప్రారంభించిన 17 మెడికల్ కాలేజీల పరిరక్షణకు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో కుప్పంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్ను వైసిపి నాయకులు ఆవిష్కరించారు. ఈనెల10 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు 40రోజుల పాటు రచ్చబండ కార్యక్రమం పేరుతో ప్రజాఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ ఉద్యమంలో భాగంగా 40 రోజుల పాటు రచ్చబండ పేరుతో రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో కోటి సంతకాల సేకరణ నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా కుప్పం నియోజకవర్గంలో పెద్దఎత్తున సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 28న నియోజకవర్గాల్లో వైసీపీ ర్యాలీలు నిర్వహించి, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వైసిపి మండల అధ్యక్షులు హెచ్.ఎం.మురుగేష్, బాబురెడ్డి, దండుపాణి, కోదండ రెడ్డి, కౌన్సిలర్లు మునిరాజ్, మోహన్రామ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రభుత్వ వ్యతిరేక విధానానికి ప్రజా ఉద్యమమే కోటి సంతకాల సేకరణ అని నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కరిడివారిపల్లి, జిల్లేడుపల్లి పంచాయతీలలో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ చైర్మన్ కుమార్రాజా, రాష్ట్ర కమిటీ సభ్యులు లలిత కుమారి, ఎంపీపీ అమరావతి, సర్పంచులు ఆశ రాజేష్, భారతి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృపాశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తే వైసిపి ప్రభుత్వం అడ్డుకుంటుందని జిడి వైసిపి ఇన్చార్జ్ కె. కృపాలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని దాసరిగుంట సురేంద్ర నగరంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 10వ తేది నుండి నవంబర్ 22 వరకు రచ్చ బండ కార్యక్రమంలో భాగంగా వైసిపి కోటి సంతకాల ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వైసీపీ బూత్ కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, మండల కన్వీనర్లు శేఖర్ రాజు, మణి, జడ్పిటిసి సుకుమార్ సర్పంచులు ధనంజయవర్మ, పెరిసామిరెడ్డి, ధనశేఖర్ వర్మ, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి చందు రాజు, ఎంపీటీసీ ధన శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.



బంగారుపాళ్యంలో..



కార్వేటినగరంలో..

క్రైం న్యూస్

హత్యకేసులో నిందితులు అరెస్టు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలో ఈనెల 6వతేదీ వివాహేతర సంబంధం కారణంగా ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య ఆమె ప్రియుడిని చిత్తూరు 2 టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించడం జరిగింది. పట్టణంలోని సంతపేట, దుర్గమ్మ గుడివీధిలో నివసిస్తున్న బి.వెంకటేష్ అనే వ్యక్తిని, అతని రెండవ భార్య తులసి అలియాస్ కావ్య, ఆమె ప్రియుడు సురేష్ కలిసి దారుణంగా హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిత్తూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో 2 టౌన్ ఇన్స్పెక్టర్ డి.నెట్టికంఠయ్య 2 టౌన్ ఎస్ఐ రమేష్ బాబుల పర్యవేక్షణలో పోలీసులు బృందాలుగా ఏర్పడి వేగంగా దర్యాప్తు చేపట్టి, కేసులో కీలక ఆధారాలు సేకరించారు. మృతుడు వెంకటేష్ తన రెండవ భార్య తులసి ప్రవర్తనపై అనుమానం కలిగింది, ఆమెకు ఆర్.సురేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని తెలుసుకున్న వారించే క్రమంలో ఇరువురికి తరచూ గొడవలు జరిగేవి. దీతో ప్రియుడితో కలిసి భర్తను చంపాలని 6న సాయంత్రం సుమారు 4 గంటలకు వెంకటేష్ ఇంట్లో నిద్రిస్తుండగా ఇద్దరూ కలిసి తాడుతో అతని గొంతు బిగించి హత్య చేశారు. అనంతరం, సంఘటనను దాచిపెట్టేందుకు తాడును మంచం కింద దాచి ఆత్మహత్యగా మార్చారని దర్యాప్తులో తెలిసింది. శుక్రవారం 9వ తేదీ తులసి, సురేష్ను అరెస్టు చేసి, రిమాండ్కు తరలించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలో గత నెల 30వ తేదీన జరిగిన దొంగతనం కేసులో సుమారు 25 లక్షల విలువ 210 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 లక్షల నగదు, లక్ష విలువ గల ఒక ద్విచక్ర వాహనాన్ని టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాళాలు వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముద్దాయి హనుమంతప్ప ఎన్ని దొంగతనాలు చేసినా, ఒంటరిగా నేరం చేయడం ఇతని లక్షణం. కర్నాటక రాష్ట్రంలోని సోలాపూర్, హుబ్లీలి, ఆంధ్రప్రదేశ్లోని చిత్తూరు జిల్లా, అనంతపురం జిల్లా, ఇతర రాష్ట్రాలలో ఇతనిపై కేసులు ఉన్నాయి. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో 2 టౌన్ ఇన్స్పెక్టర్ డి.నెట్టికంఠయ్య 2 టౌన్ ఎస్ఐ రమేష్ బాబు, సిబ్బంది కొన్ని బృందాలుగా ఏర్పడి కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్లోని అనంతపురం, ఇతర ప్రదేశాలలో సాంకేతికతను ఉపయోగించి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రారం 2 టౌన్ పోలీసులకు అందిన సమాచారం మేరకు చిత్తూరులోని బాన్స్ హోటల్ వద్ద హనుమంతప్పను అరెస్ట్ చేసి, అతని వద్ద ఉన్న రూ.25 లక్షలు విలువ గల 150 గ్రాముల బంగారం, అనంతపురం జిల్లా కేసులో రూ.60 గ్రాముల బంగారం మొత్తం 210 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 లక్షల నగదు, లక్ష విలువ గల ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని అతనిని రిమాండ్కు తరలించడం జరిగిందన్నారు.

లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలో లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ మురళీమోహన్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం పలమనేరు టౌన్, పాతపేట, పోలీస్ లైన్లో నివాసం ఉంటున్న అహ్మద్ అనే వ్యక్తి లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో అతన్ని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే లాటరీ టికెట్లు అమ్మగా వచ్చిన రూ.5020లు డబ్బులు, రూ.22750లు విలువ గల 199 లాటరీ టికెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇతనికి లాటరీ టికెట్లు అమ్మిన పలమనేరు టౌన్కు చెందిన చౌడప్ప అనే వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడని అతని మీద కూడా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

టపాసుల విక్రయాల వద్ద

జాగ్రత్తలు తప్పనిసరి : డీఎస్పీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: టపాసులు విక్రయాలు, గోదాముల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం నగరి డిఎస్పి సయ్యద్ మహమ్మద్ అజీజ్ టపాసుల యజమానులను ఆదేశించారు. టపాసుల విక్రయాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జాగ్రత్తలు లేని షాపులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాసుల విక్రయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉన్నచోట సిబ్బందిని ఏర్పాటు చేసి రద్దీని నియంత్రించాలని, ఎక్కడైనా అసంఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్వేటినగరం సిఐ హనుమంతప్ప, కార్వేటినగరం ఎస్ఐ రమేష్, టపాసుల విక్రయ యజమానులు పాల్గొన్నారు.

సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పలమనేర్ క్యాంప్ కోర్టు కుప్పం

S.O.P. No. 2 of 2025

మధ్య
పి సర్వాణి W/o. ప్రేమ్కుమార్
పి రామ్కుమార్ S/o. ప్రేమ్కుమార్
Both are residing at Door No.8/257 Bye pass Road, Kuppam Post & Mandal,
తన్మయ ప్రవీణ D/o. ప్రేమ్కుమార్
Door No.127/A,38th B-Cross, Jayanagar 9th Block, Bangalore Karnataka 560069

పిటిషనర్లు

మరియు

NIL **ప్రతివాది**

పిటిషనర్లు తరపున సాధారణ కోర్టు నోటీసు /ప్రకటన

మొదటి పిటిషనరు భర్త మరియు రెండు మూడు పిటిషనర్లు కు తండ్రి అయిన Late. ప్రేమ్కుమార్ గారు కుప్పం పోస్టాఫీసులో సేవింగ్స్ అకౌంట్ నెం.7055425284 మరియు CFID నెం.243266052 లో పొదుపు చేసిన మొత్తం 10,99,347/- తేది నా 21-06-2025 పై నగదు వాపసు తీసుకొనుటకు పై కోర్టు లో వారసత్వ ధృవీకరణ పత్రం (Succession Certificate) ఇవ్వవలసిందిగా కోరి పిటిషన్ దఖాలు చేసినారు. కావున పై తెలిపిన పిటిషనర్లు కు న్యాయస్థానం వారు వారసత్వ ధృవీకరణ పత్రం (Succession Certificate) మంజూరు చేయు విషయంలో ఎవరికైనా యేటువంటి అభ్యంతరములు వున్నచో పై కోర్టులో ముందు వాయిద తేది 28-10-2025 ఉదయం 10-30 గం॥లకు నెరుగా గాని ప్లీడారు ద్వారగాని తెలియజేయవచ్చును అట్లు లేని చో పిటిషన్లకు వారసత్వ సర్టిఫికేట్ (Succession Certificate) పై కోర్టు వారిచే మంజూరు చేయబడును.

వాయిద తేది 28-10-2025
పి వి మధుసూధన్ B.Com. LLB.,
పిటిషనర్లు తరుపున న్యాయవాది, కుప్పం